నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | మంగళవారం 14 నవంబర్ 2023 www.ntnews.com

దటీజ్ తెలంగాణ

'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా-2023' ప్రకారం 10.13లక్షల సీసీ కెమెరాలతో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. అతిపెద్ద రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, బీహార్, మధ్యప్రదేశ్ సైతం తెలంగాణ తర్వాతనే ఉన్నాయి.



సంక్షేమం

కులవృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలని రూ.1,000 కోట్లతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని తెలంగాణ సర్కారు తీసుకొచ్చింది. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీతో వీటి పెంపకం లాభదాయకంగా మారింది.

ఉచిత చేప పిల్లల పంపిణీ

ప్రారంభం
2016

# తలసిరి మన సొంతం

ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు తలసరి ఆదాయాన్నే గీటురాయిగా తీసుకొంటారు. అంతటి ప్రాధాన్యమున్న తలసరి ఆదాయ వృద్ధిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది. దేశానికి రోల్‌మాడల్ అని బీజేపీ పరివారం గప్పాలకు పోతున్న గుజరాత్ ఈ జాబితాలో టాప్-10లో కూడా లేక పోగా.. ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ అట్టడుగు స్థానంలో ఉన్నది. 2013-14లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.93,151 ఉంటే, ప్రస్తుతం రూ.3,12,398కి చేరింది. దేశ సగటు తలసరి ఆదాయం రూ.1,72,000 కంటే తెలంగాణ ఆదాయం రూ.1,40,398 ఎక్కువ.

- స్పెషల్ టాస్క్ బ్యూరో, నమస్తే తెలంగాణ


మనమే నెంబర్ 1

తొమ్మిదిన్నరేండ్లలో వచ్చిన మార్పు

2014
రూ. 93,151

2023
రూ. 3,12,398

పెరుగుదల
235%




విశేషం:

మనకంటే వందేండ్ల ముందే రాష్ట్రంగా ఏర్పడి, మూడు రెట్లు ఎక్కువ జనాభా ఉన్న బీహార్ పౌరుడి తలసరి ఆదాయం రూ. 54,383 మాత్రమే. బీహార్‌లోని ఆరుగురు సభ్యులున్న ఓ కుటుంబం ఆర్జించే సంపాదనను తెలంగాణలో ఒక్క వ్యక్తే సంపాదించగలడు.

### తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ, జాతీయ తలసరి ఆదాయాలు

| సంవత్సరం | తెలంగాణ | | దేశ | |
|---|---|---|---|---|
| | తలసరి ఆదాయం | వృద్ధి(%) | తలసరి ఆదాయం | వృద్ధి(%) |
| 2013-14 | రూ. 93,151 | 8.52 | రూ. 83,119 | 8.1 |
| 2014-15 | రూ.1,24,104 | 10.6 | రూ. 86,647 | 9.5 |
| 2015-16 | రూ. 1,40,840 | 13.5 | రూ. 94,797 | 9.4 |
| 2016-17 | రూ. 1,59,395 | 13.2 | రూ. 1,03,870 | 9.6 |
| 2017-18 | రూ. 1,79,358 | 12.5 | రూ. 1,15,224 | 10.9 |
| 2018-19 | రూ. 2,09,848 | 17.0 | రూ. 1,25,946 | 9.3 |
| 2019-20 | రూ. 2,31,378 | 10.3 | రూ. 1,32,115 | 4.9 |
| 2020-21 | రూ. 2,31,103 | -0.1 | రూ. 1,26,855 | -4.0 |
| 2021-22 | రూ. 2,75,443 | 19.2 | రూ. 1,50,007 | 18.3 |
| 2022-23 | రూ. 3,12,398 | 13.8 | రూ. 1,72,000 | 13.7 |




# చెప్పేది కొండంత ఇచ్చేది గోరంత..

మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌కు 98% సాయం
కాగ్ తాజా నివేదికలో వెల్లడి

## గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో తెలంగాణపై కేంద్రం కక్ష సాధింపు

ఎదుగుతున్న తెలంగాణపై కన్నతల్లి ప్రేమ చూపాల్సిన మోదీ సర్కారు కనీసం సవతి ప్రేమయినా చూపడం లేదు. సాయం అటుంచితే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నది. రాష్ట్ర ప్రగతికి అన్నివిధాలా మోకాలడ్డే ప్రయత్నం చేస్తున్నది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయంలో ఏటా వివక్ష చూపుతూనే ఉన్నది.

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే కేంద్ర సర్కారు తెలంగాణపై వివక్షకు తెర లేపింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తాజాగా విడుదల చేసిన నెలవారీ నివేదికనే ఇందుకు నిదర్శనం. 2023-24కు సంబంధించి కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.41,259 కోట్లు అందుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశించింది. ఈ మేరకు బడ్జెట్ ప్రణాళికలో పొందుపరిచింది. కానీ కేంద్రం మొదటి నెల ఏప్రిల్‌లోనే తన వక్రబుద్ధిని చూపించింది.

**మే నెలలో కంటి తుడుపుగా..**

మే నెలలో కంటి తుడుపుగా రూ.1,438 కోట్లు అందించింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం ఇచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.3,619 కోట్లు మాత్రమే. ఇప్పటికే సగం ఆర్థిక సంవత్సరం ముగిసిపోగా.. ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చిన గ్రాంట్ 8 శాతమే కావడం శోచనీయం (రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో). గత ఆర్థిక సంవత్సరం రూ.41,001 కోట్లు అందుతుందని రాష్ట్రం ఆశించగా మొదటి ఏడు నెలల్లో రూ.5,507 కోట్లు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చినా ఈసారి సెప్టెంబర్ వరకు రూ.1,888 కోట్లు తక్కువగానే అందింది.

### గతేడాది రూ.13,179 కోట్లే..

గత ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి కేంద్రం నుంచి అందిన గ్రాంట్ రూ.13,179 కోట్లు. ఆ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ అంచనాల్లో ఇది 32 శాతం. దేశంలోని ఏ ఇతర రాష్ట్రానికి కేంద్రం ఇంత తక్కువగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇవ్వలేదు.

**కేంద్రం నుంచి అందిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ 2023-24 (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| ఏప్రిల్ - | జూలై 506 |
| మే 1,438 | ఆగస్టు 692 |
| జూన్ 373 | సెప్టెంబర్ 610 |
| మొత్తం 3,619 | |

**ఉత్తరాది రాష్ట్రాలకే ప్రాధాన్యం..**

బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం దండిగా సాయం చేస్తున్నది. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు బడ్జెట్ అంచనాల్లో 98 శాతం గ్రాంట్‌ను ఇప్పటికే అందించింది. రూ.16,290 కోట్లు అందుతుందని గుజరాత్ బడ్జెట్‌లో అంచనా వేయగా, మొదటి ఏడు నెలల్లోనే రూ.15,977 కోట్లు ఇచ్చింది. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.16,965 కోట్ల గ్రాంట్ విడుదలైంది. తెలంగాణతో పోలిస్తే ఉత్తర్‌ప్రదేశ్‌కు అందిన సాయం రూ.13,346 కోట్లు ఎక్కువ.

**కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు ఆశాజనకంగా**

గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.18,005 కోట్లు వస్తుందని కర్ణాటక అంచనా వేయగా.. ఏడు నెలల్లోనే కేంద్రం నుంచి రూ.5,179 కోట్ల సాయం అందింది. ఆ రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో ఇది 29 శాతం. ఛత్తీస్‌గఢ్‌కు రూ.4,363 కోట్ల సాయం ఇచ్చింది. ఆ రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో అందిన సాయం 29 శాతం.

**దేశ జీడీపీలో రాష్ట్రం పెద్దన్న పాత్ర..**

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లోనే కాకుండా చట్టబద్ధంగా రాష్ట్రానికి అందాల్సినవీ ఇవ్వడం లేదు. దేశ జీడీపీలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతున్నది. మిగతా రాష్ట్రాలకిచ్చినట్టు తెలంగాణకు ఇస్తే రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం మరింత అద్భుతంగా ఉండేదనడంలో సందేహం లేదు.

... సూర్యకిరణ్

సోషల్ యాంగిల్



## ఎవలేం జెప్పుగ్రో ఇనాలె..

రామక్క : ఓ లచ్చక్క.. మొన్న ఇంటికొస్తె లేవ్.. ఏడికివోయినవ్?
లచ్చక్క: కాంగిరేసోళ్లు పిలిస్తె కామారెడ్డి పోయొచ్చినలే..
రా : అవునా.. ఎటు విలిస్తే అటే వోతున్నవ్.. ఎందుకట్ల?
ల : ఎవలేం జెప్పుగ్రో ఇనాలె గద సెల్లె. గందుకే వోయిన..
రా : మరి గా రేవంతం, సిద్ధప్ప సార్లు ఏం జెప్పిగ్రు మన తెలంగాణ ముచ్చట..
ల : ఆళ్లకేం దెల్వనట్టే ఉంది రాష్ట్రం సంగతి.. అందుకే మీటింగుకు ఎవ్వగ్రాలే.. ఎటు జూసినా ఖాళీ కుర్సీలే కనిపించినయ్.. ఇగ వచ్చినోళ్ల నోళ్లలయితే 'గులాబీల జెండలే రామక్క' పాటనే ఉంది..
రా : సూసినావ్.. పనిమంతుడైన కేసీఆర్ సారెక్కడ.. ఏ పనీ లేని రేటెంత రెడ్డెక్కడ.. అందుకే గులాబీ మీటింగులల్ల జనం పుచ్చిపోతుండ్రు..
ల: 'ఎవలేం జెప్పుగ్రో ఇనాలే.. అండ్ల పనిమంతుడెవడో గుర్తు వట్టాలే. ఆనెంటనే నడవాలే.. అని కేసీఆర్ సారు ఊకే అంటడు.
రా : నిజమే.. నేన్ గూడ నలుగురిని పోగేస్కొని మీటింగులకస్తా.. ఆ నలుగురు ఇంకో నలుగురిని తయారుజేసెటట్టు సూస్త.. పెద్ద సారు మళ్లా గెల్వాలె.. మనమంతా సల్లంగ ఉండాలె..

- సురేందర్ బండారు

## సుందరంగా రంగధాముని చెరువు





కూకట్‌పల్లి పరిధిలోని రంగధాముని (ఐడీఎల్) చెరువును ప్రభుత్వం అత్యాధునిక హంగులతో సుందరీకరిస్తున్నది. ఇందుకోసం రూ.50 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే రూ.8 కోట్లతో ఫ్రంట్ లేక్ పార్కును అభివృద్ధి చేసింది. చెరువు చుట్టూ కంచెతో పాటు వాకింగ్ ట్రాక్‌ను నిర్మించగా, వినాయక, బతుకమ్మ, దుర్గామాత నిమజ్జనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా రూ.19.3 కోట్లతో ప్రత్యేక పైప్‌లైన్లు వేస్తున్నారు. భవిష్యత్‌లో బోటింగ్ సౌకర్యం కూడా కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. - కేపీహెచ్‌బీ కాలనీ

# రామన్నే మా నాయకుడు

**• సిరిసిల్లవాసుల మాట**

ఓటెవలకేస్తవని ఏ పార్టీ నాయకుడొచ్చి అడిగినా మీకే ఏస్తం అని బదులిస్తరు జనాలు. మనసులో ఉన్నదైతే చెప్పరు. కానీ కొందరు భిన్నంగా ఉంటరు. మనసులో ఉన్న సంగతిని మొహం మీదే చెప్తరు. లోకల్, స్టేట్, సెంట్రల్ దాకా మొత్తం వాడుక భాషలో చర్చ పెడుతరు. ఆ కోవలోకే వస్తారు సిరిసిల్ల సెగ్మెంట్ ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన గుండెల్లి రాములుగౌడ్. బాల్యంలో క్రికెటర్‌గా ఊరిలో ఫేమస్. అందుకే అజ్జు భాయ్ అని కొందరు, రామన్న అని ఇంకొందరు పిలుచుకుంటరు. వార్డు మెంబర్, ఉప సర్పంచ్, ఇన్‌చార్జి సర్పంచ్, గౌడ సంఘం అధ్యక్షుడిగా సేవలందించడంతో అందరికీ సుపరిచితమైండు. ముస్తాబాద్‌లోనే కూరగాయల దుకాణం నడిపిస్తున్నడు. వాస్తవాల ప్రాతిపదికన తన 'లైన్' ఉంటుంది.



సిరిసిల్లను ప్రగతి పథం వైపు నడిపిస్తున్న కేటీఆర్ అంటే రాములుకు చెప్పలేనంత అభిమానం. పొన్నం ప్రభాకర్ గౌడ్ ఎంపీ అభ్యర్థిగా 2014లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు.. సెంట్రల్ మీకు, స్టేట్‌లో కేటీఆర్‌కే ఓట్లేస్తమని బందనకల్ స్టేజీ వద్ద ఫేస్ టు ఫేస్ చెప్పేసి పొన్నంను ఆశ్చర్యానికి గురి చేసిండు. ఈడికి రేవంత్ రెడ్డచ్చినా, ఉత్తమ్ రెడ్డచ్చినా.. ఇంకెవలచ్చినా ఏం జేయలేరని కుండ బద్ధలు కొట్టినట్టు చెబుతాడు. నిత్యం అభివృద్ధి చేస్తూ తమకు అందుబాటులో ఉంటున్న కేటీఆర్ సారుకే సపోర్ట్ చేస్తమంటుండు.

... ఇల్లెందుల దుర్గాప్రసాద్

షహర్ కీ బాత్



**మహిళలకు మరింత భద్రత**

తెలంగాణ ఏర్పాటు అనంతరం నగరంలో మహిళల భద్రతకు రక్షణ చర్యలు తీసుకున్నది ప్రభుత్వం. ఏ కుటుంబానికైనా తండ్రి లెక్క, పెద్దన్న లెక్కనే అని చెప్పాలి. నగరంలో పోలీసు వ్యవస్థను పటిష్టం చేశారు. చీమ చిటుక్కుమన్నా నిమిషాల్లోనే చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేస్తున్నది. మునుపటి లెక్క గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నది. ఇందుకోసం పోలీసు కొలువులను కూడా నింపుతున్నరు. వృద్ధులు, ఒంటరి మహిళలకు, కాళ్లు చేతులు లేనోళ్ల ఇబ్బందులను గుర్తించి పింఛన్లతో ఆదుకుంటున్నది సర్కారు. ఇంతమంచిగ మహిళలు, ప్రజల భద్రతను కట్టుదిట్టం చేసిన సీఎం కేసీఆర్‌కు మహిళలందరం మద్దతుగా నిలుస్తం.

- పల్లె పెంటమ్మ, సికింద్రాబాద్

# గిరిజనులకు ఆరోగ్య రక్ష

## రూ.54 కోట్లతో 300 పడకల ఏరియా దవాఖాన

ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం గిరిజన తెగల ప్రజలకు నెలవుగా ఉన్నది. మొత్తం జనాభాలో దాదాపు 45 శాతం గిరిజనులు ఇక్కడ ఉండటం విశేషం. ఈ కారణంగానే దీనిని షెడ్యూల్డ్ తెగల విభాగంలో ఎంపిక చేసి ఎమ్మెల్యే స్థానాన్ని రిజర్వ్ చేశారు. నాటి హైదరాబాద్ రాజ్యంలో గిరిజనులకు అడవిపై హక్కుల కోసం అసఫ్‌జాహీ పాలకులతో పోరాడిన గిరిజనోద్యమ నాయకుడు కుమ్రం భీం ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తే.

బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి విజయం నల్లేరుపై నడకే..



కోవ లక్ష్మి



కుమ్రం భీం స్మారక చిహ్నం

ఎలక్షన్ వ్యూ : ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 1983 వరకు వరుసగా ఆరుసార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. 1983 నుంచి 2009 వరకు సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ గెలిచాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో బీఆర్ఎస్ గులాబీ జెండా ఎగిరింది. ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిపై 174 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఆయన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడింది.

**అంచనాలకు మించి అభివృద్ధి..**

ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని ప్రభుత్వం అంచనాలకు మించి అభివృద్ధి చేసింది. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు (ఉట్నూర్ వరకు) రూ.65 కోట్లతో రెండు వరుసల రహదారి వేసింది. చరిత్రాత్మక గ్రామమైన జోడేఘాట్‌కు రూ.15 కోట్లతో రెండు వరుసల రహదారి నిర్మించి, రూ.25 కోట్లతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దింది. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. రూ.105 కోట్లతో 24 హైలెవల్ వంతెనల నిర్మాణం చేపట్టింది.

**రూ.28 కోట్లతో 6 చెక్‌డ్యాంల నిర్మాణం**

ప్రభుత్వం నియోజకవర్గంలో రూ.28 కోట్లతో 6 చెక్‌డ్యాంలను నిర్మించింది. వాంకిడి మండలంలోని సంకేపల్లి వాగుపై రూ.3.33 కోట్లు, ఆసిఫాబాద్ మండలంలోని కేస్లాపూర్ వాగుపై రూ.4.65 కోట్లు, ఖమానా వాగుపై రూ.3.52 కోట్లు, వాంకిడి వాగుపై రూ.3.33 కోట్లు, గంగాపూర్ వాగుపై రూ.5.77 కోట్లు, రామగూడ వాగుపై రూ.2.50 కోట్లతో చెక్‌డ్యాంలను నిర్మించింది. వీటి ద్వారా సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందుతున్నది.

... జాడి హన్మయ్య




ప్రభుత్వ మెడికల్ కళాశాల

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ఆసిఫాబాద్‌లో ప్రభుత్వం రూ.100 కోట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రంలోని పీహెచ్‌సీని రూ.7 కోట్లతో ఆధునీకరించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చింది. రూ.54 కోట్లతో 300 పడకల ఏరియా దవాఖానను ఏర్పాటు చేస్తున్నది. నియోజకవర్గంలోని జైనూర్, తిర్యాణి, కెరమెరి పీహెచ్‌సీలను సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.